క్లుప్తంగా

వృద్ధులకు దుప్పట్లు పంపిణీ



రేపల్లె రూరల్: మండలంలోని ఉప్పూడి దాసరిపాలెంలోని పలువురు వృద్ధులకు ప్రవల్లిక సపోర్ట్ సేవా సంస్థ శనివారం చేయూతనందించింది. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో పట్టణ ఎస్‌ఐ రాజశేఖర్ పాల్గొని మాట్లాడారు. వృద్ధులకు, వితంతువులకు, పేదలకు చేయూత నిస్తూ ప్రవల్లిక సపోర్ట్ చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. ఆపదలో ఉన్న వారిని ప్రతి ఒక్కరూ మానవత్వంతో ఆదుకోవాలని కోరారు. ఈసందర్భంగా వృద్ధులు, వితంతువులకు దుప్పట్లు పంపిణీ చేశారు. న్యాయవాది దోవా రమేష్‌రాంజీ, సంస్థ ఫౌండర్ కంచర్ల ప్రవల్లిక, కర్రా మోహన్‌దాసు, నీలా జోజిబాబు, వీరయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం డైరీ ఆవిష్కరణ



రేపల్లె రూరల్: ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రూపొందించిన డైరీ, క్యాలెండర్‌లు ఉపాధ్యాయులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని మండల విద్యాశాఖ అధికారి కేసనశెట్టి సురేష్ అన్నారు. ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన డైరీ, క్యాలెండర్‌లను శనివారం సాయంత్రం మండల విద్యావనరుల కేంద్రంలో ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చందోలు వెంకటేశ్వర్లు, సభ్యులు దర్శి భాస్కరరావు, అంబటి జాకబ్, కృపారావు, శ్రీనివాసరావు, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు దోహదం



అమర్తలూరు(వేమూరు): పర్యావరణ పరిరక్షణకు మొక్కలు చాలా అవసరమని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నిరీక్షణరావు తెలిపారు. అమర్తలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా దాతలు మొక్కలు పంపిణీ చేశారన్నారు. పాఠశాలలో వివిధ మొక్కలు చాలా అవసరమన్నారు. పాఠశాల అభివృద్ధికి దాతలు ముందుకు అభినందనీయమని ఆయన తెలిపారు. ఉపాధ్యాయులు గిరిధర్, ఆదినారాయణ, శ్యామ్, మాజేటి వెంకటేశ్వరరావు, మధు ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

పౌర హక్కుల దినోత్సవం



కర్లపాలెం: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వినియోగించుకోవాలని ఎంపీడీఓ ఎ.శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని పాత నందాయపాలెం గ్రామంలో శనివారం పౌర హక్కుల దినోత్సవం నిర్వహించారు. గ్రామస్తులు సంక్షేమ పథకాలపై అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. అందరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. తహసీల్దార్ సుందరమ్మ మాట్లాడుతూ అందరూ తమ పిల్లలని బాగా చదివించుకుని ప్రయోజకులను చేయాలని చెప్పారు. ఈ సమావేశంలో గ్రామస్తులు తమ కాలనీలోని కొన్ని గృహాలకు తాగునీటి కుళాయిలు ఏర్పాటు చేయాలని కోరగా కుళాయిల ఏర్పాటుకు కృషి చేస్తామని ఎంపీడీఓ చెప్పారు. కార్యక్రమంలో వీఆర్వో శివనాగరాజు, మహిళా పోలీస్ ఆనంద కుమారి తదితరులు పాల్గొన్నారు.

రక్షణ సైన్యం ప్రార్థనా మందిరం వార్షికోత్సవం



తెనాలి: పట్టణ అయితానగర్‌లోని రక్షణ సైన్య ప్రార్థనామందిరం అయిదో వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. లెఫ్టినెంట్ కర్నల్ గేరా థామస్, లెఫ్టినెంట్ కర్నర్ గేరా సియోనుకుమారి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. మన అవసరాలు, బాధలను దేవునికి తెలియజేసి, దీవెనలు అందుకునేందుకు మంచి ప్రార్థనా మందిరాన్ని దేవుడు ఇచ్చాడని వారు ప్రజలకు తెలియజేశారు. సంఘకాపరి మేజర్ నాగరాజు, మేజర్ రత్నసుందరి, సంఘపెద్దలు గాలి రవికుమార్, పిల్లి కనకరత్నం, బట్టు జక్రయ్య, కారుమంచి నరసింహ, రుద్రపాటి ఆశీర్వాదం, సంఘం యవ్వనస్తులు కలిసి వార్షికోత్సవాన్ని ఘనంగా జరిపారు.

చెత్త సమస్యకు చెక్!

- పట్టణంలో చెత్త సమస్యకు పరిష్కారం
- చెత్తను జిందాల్ కంపెనీకి తరలించాలని గతంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రతిపాదనలు
- ప్రస్తుతం అమలు చేస్తున్న అధికారులు
- ప్రతిరోజూ 40 టన్నుల చెత్త తరలింపు



చెత్త తరలింపును ప్రారంభిస్తున్న కమిషనర్



చెత్త వ్యర్థాలను వేరుచేస్తున్న యంత్రం

బాపట్ల: బాపట్ల పురపాలక సంఘంలో కొండల్లా పేరుకుపోయిన చెత్త నుంచి వచ్చే దుర్గంధంతో ముక్కు పుటలు అదిరిపోవాల్సిందే.. అయితే ప్రస్తుతం బాపట్ల పుర ప్రజలకు చెత్త సమస్యకు శాశ్వత పరిష్కారం దక్కింది. పట్టణంలో వచ్చే చెత్తను ఎప్పటికప్పుడు తరలిస్తే సమస్య పూర్తిగా పరిష్కారం అవుతుందని వైఎస్సార్ సీపీ చేపట్టిన ప్రతిపాదనలకు కార్యరూపం దొరికింది. జిందాల్ కంపెనీకి చెత్త తరలించే ప్రక్రియకు మున్సిపల్ అధికారులు సిద్ధమయ్యారు.

బాపట్లలో చెత్త సమస్య ఇలా..

పట్టణంలో ప్రతి రోజు 40టన్నుల చెత్త వస్తోంది. ఈచెత్తను బాపట్ల పట్టణంలోని జమ్ములపాలెం రోడ్డులోని 15 ఎకరాల డంపింగ్‌యార్డుకు తరలిస్తుంటారు. డంపింగ్‌యార్డులో చెత్త నిల్వలు ఎక్కువ కావటంతో వాటిని తగలపెట్టి మళ్లీ చెత్త చెదారం అక్కడ వేస్తుంటారు. దీంతో వాయుకాలుష్యంతోపాటు చెత్తచెదారం రోడ్లపై చెల్లాచెదురుగా పడిఉండేది. అంతేకాకుండా నూతనంగా నిర్మిస్తున్న మెడికల్ కళాశాల వద్ద డంపింగ్ యార్డు ఉండటంతో తీవ్ర సమస్యగా మారింది.

తరలింపు ఇలా..

పట్టణ ప్రాంతాలోని చెత్తాచెదారం తొలగించిన వాటిని పొడిచెత్త, తడి చెత్తగా వేరువేసి వాటిని గుంటూరు సమీపంలోని జిందాల్ పవర్ కంపెనీకి తరలించేందుకు వైఎస్సార్ సీపీ ప్రతిపాదనలు చేసి రంగం సిద్ధం చేసింది. ఎన్నికలు రావటంతో ఆ ప్రతిపాదన కార్యరూపం దాల్చలేదు. తాజాగా ఆ ప్రతిపాదనను ముందుకు తీసుకువచ్చారు. దీంతో ప్రతిరోజు బాపట్ల నుంచి 40 టన్నుల చెత్తను తరలిస్తున్నారు. ఎప్పుడు నుంచో పేరుకుపోయిన చెత్తను కూడా క్లీన్ చేసి తరలించేందుకు యంత్రాన్ని కూడా ఆప్రాంతంలో ఏర్పాటు చేశారు. ఈవిధంగా చేయటంతో ఆప్రాంతాభివృద్ధితోపాటు చెత్త, చెదారం నిల్వలు పట్టణంలో లేకుండా ఉండే అవకాశం ఉంది.

చెత్త తరలింపునకు ప్రత్యేక చర్యలు

చెత్త తరలింపునకు ప్రత్యేక చర్యలు తీసుకున్నాం. రోజుకు 40 టన్నుల చెత్తను గుంటూరుకు సమీపంలోని జిందాల్ కంపెనీకి పంపుతున్నాం. పట్టణంలో ఎక్కడ చెత్త నిల్వలు లేకుండా ప్రత్యేక కార్యచరణ చేపట్టాం. ప్రజలు రోడ్లపై చెత్తచెదారం వేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

–జి.రఘునాథరెడ్డి, మున్సిపల్ కమిషనర్

అంకితభావంతో పని చేస్తేనే గుర్తింపు

ఎంపీడీఓ బాబురావు



ఈఓఆర్‌పీడీ పులిశరత్‌బాబును సన్మానిస్తున్న ఎంపిడిఓ బి.బాబురావు, సిబ్బంది

బాపట్ల: అంకితభావంతో పనిచేసే ఉద్యోగులకు మంచి గుర్తింపు దక్కుతుందని ఎంపీడీఓ పులి శరత్‌బాబు పేర్కొన్నారు. గ్రామీణాభివృద్ధి విస్తరణాధికారిగా పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన పులి శరత్ బాబును శనివారం ఎంపీడీఓ కార్యాలయంలో సన్మానించారు. ఈసందర్భంగా ఎంపీడీఓ బాబురావు మాట్లాడుతూ పంచాయతీరాజ్ విభాగంలో 35 సంవత్సరాలుపాటు వివిధ హోదాల్లో పని చేసి ప్రజలకు నేరుగా సేవ చేసే అదృష్టం పులి శరత్‌బాబుకు దక్కిందన్నారు. గ్రామీణ ప్రాంతంలో ఏసమస్య వచ్చినా వెంటనే స్పందించి వాటిని పరిష్కరించటంలో ఆయన చూపిన చొరవ అభినందనీయమన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక అవగాహన కల్పించటం గొప్పవిషయమన్నారు. ఈకార్యక్రమంలో ఏఈ మోహనరావు, ఎలక్ట్రికల్ ఏఈ కోటేశ్వరరావు, పరిపాలన అధికారి జె.బి.ఎస్.రజని, పంచాయతీ కార్యదర్శి పల్నాటి శ్రీరాములు, పులి వాసు తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా పులి శరత్‌బాబు ఆయన సతీమణి పద్మలతలను సన్మానించారు.

గుణాత్మక విద్యనందించాలి

సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కో–ఆర్డినేటర్ ఎం.నాగిరెడ్డి



రికార్డులు పరిశీలిస్తున్న సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కో–ఆర్డినేటర్ ఎం.నాగిరెడ్డి

కర్లపాలెం: విద్యార్థులకు గుణాత్మక విద్యనందించాలని సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కో–ఆర్డినేటర్ ఎం.నాగిరెడ్డి చెప్పారు. మండల పరిధిలోని కొత్తనందాయపాలెం ప్రాథమిక పాఠశాలను, అంగన్వాడీ కేంద్రాన్ని అడిషనల్ ప్రాజెక్ట్ కో–ఆర్డినేటర్ ఎం.నాగిరెడ్డి శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈసందర్భంగా పాఠశాల రికార్డులను పరిశీలించి విద్యార్థులతో కలసి ఆయన భోజనం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పాఠాలను సులభరీతిలో అర్థం చేసుకునే విధంగా బోధన సాగాలని చెప్పారు. విద్యార్థులకు చదువుతో పాటు పరిశుభ్రతపై అవగాహన కలిగించాలన్నారు. విద్యార్థులు అన్ని రంగాలలో అభివృద్ధి చెందాలని, సాంకేతిక విద్యపై అవగాహన ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఏఎంఓ బి.మోజెస్, ఎంఈఓ టీయూ మనోరంజని, సీఆర్పీలు లక్ష్మి, పోతురాజు తదితరులు ఉన్నారు.

ఎంఎస్‌ఎంఈ సర్వేకు సహకరించాలి



మున్సిపల్ కమిషనర్ సాంబశివరావు

రేపల్లె రూరల్: చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, వ్యాపార సంస్థల అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో పట్టణంలో వ్యాపార సంస్థల సర్వే నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ కాకర్ల సాంబశివరావు తెలిపారు. స్థానిక కార్యాలయంలో శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. చిన్న, మధ్య తరహా పరిశ్రమల (ఎంఎస్‌ఎంఈ) సర్వే పట్టణంలో జరుగుతోందన్నారు. సచివాలయ ఉద్యోగులు పట్టణంలో సర్వే నిర్వహిస్తున్నారన్నారు. వ్యాపార సంస్థల యజమానులు సర్వేకు సహకరించి వివరాలు నమోదు చేయించుకోవాలని చెప్పారు. సర్వే ద్వారా వ్యాపార సంస్థల వివరాలు సేకరించటంతో పాటు ఆయా సంస్థల అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలను ప్రభుత్వానికి వివరించటం జరుగుతుందన్నారు. వ్యాపార సంస్థలకు కావాల్సిన పెట్టుబడులు, ముడి సరుకులు, మ్యాన్ పవర్, బ్యాంక్ రుణాలను అందించి వ్యాపార సంస్థలను అభివృద్ధి చేసేందుకు సర్వే దోహదపడుతుందన్నారు. సర్వే నిమిత్తం వచ్చే ఉద్యోగులకు ఆయా సంస్థల యజమానులు పాన్‌కార్డు, ఆధార్, చివరి నెల విద్యుత్ బిల్లు, ఈ–మెయిల్ ఐడీ, ట్రేడ్ లైసెన్స్ వివరాలను అందించి సహకరించాలని కోరారు.

ఛలో హైదరాబాద్‌ను జయప్రదం చేయాలి



ఎస్సీ వర్గీకరణకు లక్షల డప్పులు.. వేల గొంతులు పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

కొల్లూరు: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పుపై హర్షం వ్యక్తం చేస్తూ ఈనెల 7న హైదరాబాద్‌లో తలపెట్టిన లక్షల డప్పులు.. వేల గొంతులు అనే మాదిగల భారీ సాంస్కృతిక ప్రదర్శనను జయప్రదం చేయాలని కొల్లూరు మండల మాజీ ఉపాధ్యక్షుడు గోరికపూడి ప్రసాద్ అన్నారు. శనివారం కొల్లూరులో కార్యక్రమం పోస్టర్లను ఎమ్మార్పీఎస్ నాయకులతో కలసి ఆవిష్కరించారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందా కృష్ణమాదిగ ఆధ్వర్యంలో జరగనున్న కార్యక్రమంలో 7న ఉదయం 11 గంటలకు హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియం నుంచి పెద్ద అంబేడ్కర్ విగ్రహం వరకు నిర్వహించనున్న ర్యాలీ కార్యక్రమంలో భారీ సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఈసందర్భంగా కోరారు. ఎమ్మార్పీఎస్ ఉమ్మడి తెనాలి డివిజన్ మాజీ ఇన్‌చార్జి, యాక్ట్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు ఆళ్లమూడు ప్రభాకరరావు, ఎమ్మార్పీఎస్ స్థానిక నాయకులు అలపర్తి బాబు, కొమ్మూరి మధు, మద్దాల జయరావు, పాదిలి రాంబాబు, కొండూరి సతీష్, కొమ్మూరి రాములు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు దుప్పట్ల పంపిణీ



దుప్పట్ల పంపిణీలో సబ్‌కలెక్టర్ సంజనా సింహ

తెనాలి: రెడ్‌క్రాస్, తెనాలి శాఖ ఆధ్వర్యంలో రూరల్ మండల గ్రామం అంగలకుదురులోని ముక్తి ట్రైబల్ రెసిడెన్షియల్స్ స్కూలు విద్యార్థులకు దుప్పట్లను పంపిణీ చేశారు. తెనాలి సబ్‌కలెక్టర్ వి.సంజనా సింహ చేతుల మీదుగా స్కూలులోని 200 మంది విద్యార్థినీ విద్యార్థులకు ఈ వితరణ చేశారు. రెడ్‌క్రాస్, తెనాలి చైర్‌పర్సన్ ముమ్మనేని భానుమతి, హ్యాపీ హాస్పటల్ నిర్వాహకురాలు డాక్టర్ పావనీ ప్రియాంక సహాయంతో వీటిని అందజేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ కోశాధికారి నాళం శ్రీమన్నారాయణమూర్తి, సభ్యులు కుర్రా విజయలక్ష్మి, 13వ వార్డు కుర్రా సుజాత, మానేపల్లి బుచ్చిబాబు, సూరే సాంబశివరావు, ముక్తి స్కూల్ కరస్పాండెంట్ జైపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శ్రీవాసవీ అమ్మవారి ఆత్మార్పణ విశిష్టమైనది



అనుగ్రహ భాషణ చేస్తున్న బాలస్వామీజీ



హాజరైన భక్తులు

అనుగ్రహ భాషణలో శ్రీప్రజ్ఞానంద సరస్వతీ (బాలస్వామీజీ)

తెనాలి: పట్టణ బోసురోడ్డులోని శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో జరిగిన అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవంలో శుక్రవారం రాత్రి శ్రీప్రజ్ఞానంద సర్వసతి (బాలస్వామీజీ) శ్రీవాసవీ అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటుచేసిన భారీ బహిరంగసభలో భక్తుల నుద్దేశించి అనుగ్రహ భాషణ చేశారు. శ్రీవాసవీ అమ్మవారి ఆత్మార్పణ విశిష్టతను భక్తులకు తెలియజేశారు. అమ్మవారి భక్తి కీర్తనలు, పిల్లలచే భరతనాట్యం చేయించారు. అమ్మవారిని రథంపై ఆసీనురాలును చేసి పురవీధుల్లో మేళతాళాతలతో ఊరేగింపు చేశారు. భక్తులు పెద్దసంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు నూకల వెంకట వేణుగోపాలరావు, నంబూరి వెంకట కృష్ణమూర్తి, రావూరి సుబ్బారావు, ముద్దాభక్తుని రమణయ్య, నాళం రజనీ కుమార్, దేవస్థానం కమిటీ సభ్యులు, సాలిగ్రామ మఠం సభ్యులు, శ్రీవిద్యాపీఠం సభ్యులు బాలస్వామీజీతోపాటు పురవీధుల్లో ఊరేగింపులో పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదిక రద్దు

తెనాలి: స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ప్రతి సోమవారం జరిగే ప్రజాసమస్యల పరిష్కార వేదికను తాత్కాలికంగా రద్దుచేశారు. కృష్ణ–గుంటూరు నియోజకవర్గ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూలుతో ఎన్నికల ప్రవర్తన నియమావళి గత నెల 29వ తేదీనుంచి మార్చి 8వ తేదీ వరకు అమలులో ఉంటున్నందున అప్పటివరకు ప్రతి సోమవారం జరిగే సమావేశాలు అనగా, ఈనెల 3, 10, 17, 24 తేదీలు, మార్చి నెల 3వ తేదీన రద్దుచేసినట్టు వివరించారు.

పింఛన్ల పంపిణీ సకాలంలో పూర్తి చేయండి



పల్లెకోనలో పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎంపీడీఓ వెంకటరమణ



ఇంటూరులో పింఛన్లు పంపిణీ చేస్తున్న హౌసింగ్ పీడీ వెంకటేశ్వరరావు

భట్టిప్రోలు(కొల్లూరు): ప్రభుత్వం పంపిణీ చేస్తున్న సామాజిక పింఛన్లను సిబ్బంది నిర్ణీత సమయంలో పంపిణీ చేసి లబ్ధిదారులకు అండగా నిలవాలని ఎంపీడీఓ ఎస్.వెంకటరమణ అన్నారు. శనివారం మండలంలోని పల్లెకోనలో నిర్వహించిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈసందర్భంగా మాట్లాడుతూ, అర్హులైన ప్రతి లబ్ధిదారునికి ఇంటికి వెళ్లి పింఛన్ సొమ్ము అందజేయాలన్నారు. పింఛన్ల పంపిణీలో ఎటువంటి అవకతవకలకు చోటులేకుండా చూసుకోవాలని సూచించారు. లబ్ధిదారులకు ఒకచోట కూర్చోపెట్టి పంపిణీ చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిన పక్షంలో చర్యలు చేపడతామని హెచ్చరించారు. సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటూరులో...

అమర్తలూరు(వేమూరు): లబ్ధిదారులకు సక్రమంగా గ్రామ సచివాలయం సిబ్బంది పింఛన్లు అందిస్తున్నారని బాపట్ల గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్ట్ అధికారి వెంకటేశ్వరరావు తెలిపారు. అమర్తలూరు మండలంలోని ఇంటూరు గ్రామంలో శనివారం ఆయన పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వేమూరు నియోజకవర్గంలో దివ్యాంగులు, వితంతువులు, వృద్ధులు, ఒంటరి మహిళలు, వివిధ వృత్తులవారికి పింఛన్లు నూటికి నూరు శాతం పూర్తి చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. నియోజకవర్గంలో నూరుశాతం పింఛన్లు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ మారుతీ శేషాంబ, గ్రామ సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

వేమూరు మండలంలో..

వేమూరు: వేమూరు మండలంలో 94.31 శాతం పింఛన్ల పంపిణీ జరిగిందని ఎంపీడీఓ శిమన్నారాయణ అన్నారు. గ్రామ సచివాలయం సిబ్బంది శనివారం మండలంలో పింఛన్లు పంపిణీ చేశారు. మండలంలో పింఛను లబ్ధిదారులు 7170 మంది ఉండగా 6772 శాతం పంపిణీ చేయడం జరిగిందన్నారు. మిగిలిన 6 శాతం సోమవారం పంపిణీ చేస్తామని ఆయన తెలిపారు. అమర్తలూరు మండలంలో 95 శాతం పింఛన్లు పంపిణీ చేయడం జరిగిందని ఎంపీడీఓ మారుతి శేషాంబ అన్నారు. మండలంలోని 7411 పింఛన్లు ఉండగా 7079 పింఛన్లు పంపిణీ చేయడం జరిగిందని ఆమె తెలిపారు. చుండూరు మండలంలో 95 శాతం పింఛన్లు పంపిణీ చేయడం జరిగిందని ఎంపీడీఓ కుమార్‌స్వామి తెలిపారు. చుండూరు మండలంలో మొత్తం పింఛన్లు7441 ఉండగా 6895 పింఛన్లు పంపిణీ చేయడం జరిగిందని ఆయన తెలిపారు. మిగిలిన పింఛన్లు సోమవారం పంపిణీ చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు.

భక్తిశ్రద్ధలతో ఆలయ ప్రతిష్ట వార్షికోత్సవం



ప్రత్యేక అలంకరణలో షిరిడీ సాయిబాబా



ప్రతిష్ట వార్షికోత్సవం ప్రచారం చేపట్టిన భక్తులు

బాపట్ల: పట్టణంలోని చీలురోడ్డు సెంటర్‌లో వేంచేసియున్న శ్రీషిరిడీ సాయిబాబా దేవాలయం 29వ ప్రతిష్ట వార్షికోత్సవం శనివారం ప్రారంభమైంది. ఉత్సవాలను ఆలయ అర్చకుడు సాయి ప్రారంభించారు. పట్టణంలో శనివారం నుంచి 19వ తేదీ వరకు భిక్షాటన చేపట్టనున్నట్లు సాయి తెలిపారు. 13 నుంచి 20వతేదీ వరకు ప్రత్యేక పూజలు జరుగుతాయని చెప్పారు. అఖండ నామ సప్తాహం, కుంకుమార్చన, లలిత సహస్రనామం, మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, లక్ష తులసీ దళార్చన, కర్పూర హారతి, ప్రత్యేక అభిషేకం, మధ్యాహ్న హారతి, నారాయణ సేవ (అన్నసంతర్పణ), బాబా నగరోత్సవం, అఖండ నామ సప్తాహం జరుగుతాయని చెప్పారు. బాపట్ల శ్రీ షిరిడీ సాయి బాబా సేవా సమితి సభ్యులు, పుర ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.

ఆత్మహత్యాయత్నం చేసిన వివాహిత మృతి

తెనాలిరూరల్: ఆత్మహత్యాయత్నం చేసిన వివాహిత చికిత్స పొందుతూ మృతి చెందింది. సేకరించిన వివరాల ప్రకారం.. పట్టణ ఆర్‌ఆర్ నగర్‌కు చెందిన గంగా భవాని (42) మానసిక సమస్యలతో బాధపడుతూ చికిత్స తీసుకుంటోంది. గత నెల 30వ తేదీన ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యాయత్నం చేయగా గమనించిన కుటుంబసభ్యులు ఉప్రకాశం రోడ్డులోని ప్రైవేటు వైద్యశాలకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందింది. వైద్యశాల నుంచి వచ్చిన సమాచారం మేరకు త్రీ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మద్యానికి డబ్బులివ్వలేదని హత్యాయత్నం

తెనాలిరూరల్: మద్యానికి డబ్బులివ్వలేదని వ్యక్తిపై హత్యాయత్నం చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణ నాజరుపేటకు చెందిన బసవయ్య అద్దెకు ఆటోలను తిప్పుతుంటాడు. ఇతని వద్ద అంగలకుదురుకు చెందిన అనిల్ ఆటోలు అద్దెకు తీసుకుంటుంటాడు. అనిల్‌తో పాటు ఇస్లాంపేటకు చెందిన జూపల్లి వేణు, అతని స్నేహితుడు రాము శుక్రవారం రాత్రి మద్యం తాగడానికి బసవయ్యను డబ్బు అడుగగా అతను ఇచ్చేందుకు నిరాకరించాడు. తమ వద్ద ఉన్న కత్తితో అతని గొంతుపై పొడిచారు. బాధితుడు చికిత్స పొందుతూ ఇచ్చిన ఫిర్యాదు మేరకు హత్యాయత్నం కింద పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కాల్వల్లో వ్యర్థాలు లేకుండా చూడండి

అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతిరావు



సిల్ట్ పనులను పరిశీలిస్తున్న ఏసీ లక్ష్మీపతిరావు

తెనాలిఅర్బన్: కాల్వల్లో వ్యర్థాలు లేకుండా చూడాలని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వీఎం లక్ష్మీపతిరావు సూచించారు. చెంచుపేట, మార్కెట్ ఏరియాలో శనివారం జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాల్వల్లో వ్యర్థాలు పేరుకుపోవడం వల్ల పారుదల నిలిచి దోమలకు ఆవాసాలుగా మారతాయని తెలిపారు. కాల్వలను ప్రతిరోజు శుభ్రం చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఆయన వెంట పలువురు మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

బాలికల వసతి గృహం తనిఖీ



తెనాలిరూరల్: పట్టణ ఆర్‌ఆర్‌నగర్‌లోని ఎస్సీ బాలికల వసతి గృహాన్ని తహసీల్దార్ గోపాలకృష్ణ శనివారం రాత్రి తనిఖీ చేశారు. బాలికలకు అందిస్తున్న ఆహారాన్ని పరిశీలించడంతో పాటు ఆవరణను పరిశీలించారు. పట్టణానికి చెందిన కాంట్రాక్టరు సూర్యదేవర భువన్, తహసీల్దార్ మిత్ర బృందం సహకారంతో వసతిగృహానికి ఫ్యాన్లు, లైట్లు, దోమతెరలు అందించడం తోపాటు అవసరమైన గదులకు తలుపులు, మరుగుదొడ్లకు తలుపులు ఏర్పాటు చేయించి ఫ్లోరింగ్ చేయిచారు. వసతిగృహంలో పదో తరగతిచదువుతున్న విద్యార్థులు 10 మంది ఉండగా పరీక్షల్లో మంచి మార్కులు వచ్చిన వారికి ప్రోత్సాహక బహుమతులను ఇస్తామని చెప్పారు. తవరలో ప్రహరీ నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు.